# బిర్యానీ

## మడపల్లి రమేష్ రాజు

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, న్యూజెర్సీ తెలుగు కళాసమితి, రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు) సంయుక్తంగా నిర్వహించిన కథానిక (1997) పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ)



"బాబా! కోడి బిరియానీ ఎప్పుడెడతారు?"

తండ్రి సింహాచలం భుజమ్మీద స్వారీ చేస్తూ, చేతిలో జెండా పట్టుకుని, ఓ రాజకీయ పార్టీ ఊరేగింపులో వెళుతున్న అయిదేళ్ళ రాములు తండ్రిని అడిగాడు.

"జులుస్ అంబేద్కర్ బొమ్మ దగ్గరికి చేరినాక ఎడతారని కాంట్రాక్టర్ సెప్పిండు" కొడుకును సముదాయిస్తూ జవాబిచ్చాడు సింహాచలం.

అది హైదరాబాద్‌లో మే నెల మిట్టమధ్యాహ్నం. హిమాయత్‌నగర్ మెయిన్ రోడ్‌మీద జులుస్ సాగుతోంది. చుట్టుపక్కల గ్రామాలలో సూర్యుడు పొడవకముందే, లారీలలో బయలుదేరి, నగరం చేరుకున్న పిల్లా పెద్దా, ఆడమగా, అంతా చేతులల్లో పార్టీ జండాలు పట్టుకుని, రెండు బార్లుగా తీరి, సాగుతున్నారు. జులుస్ నిర్వహిస్తున్న కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో, రెండు బారుల నడుమా నడుస్తూ, నినాదాలిస్తున్నారు. పిచ్చి పీర్లులాగా చేతులూ కాళ్ళూ ఎగరేస్తున్నారు. విజయోత్సాహంతో ఊగిపోతున్నారు. బార్లు తీరి నడుస్తున్న జనంలో, ప్రారంభంలో వున్న ఉత్సాహం సన్నగిలుతోంది. మే నెల మిట్టమధ్యాహ్నం ఎండ తట్టుకోలేక, చేతుల్లోని జండాల నీడల్లో మొహాలు చాటుచేసుకుంటున్నారు. చెప్పులు లేని పాదాల్ని, వేడెక్కిన తారురోడ్డుమీద ఆన్చలేక, అడంగులు వడివడిగా వేస్తున్నారు, ఒకర్నొకరు తోసుకుంటున్నారు.

జులుస్ సాగుతోంది.

"బాబా! ఈ జులుస్ దేనికి?" హటాత్తుగా అడిగాడు రాములు తండ్రిని.

"తెల్వద్" ముక్తసరిగా జవాబు చెప్పేడు తండ్రి సింహాచలం కొడుకుని ఓ భుజం మీంచి మరో భుజం మీదికి మార్చుకుంటూ.

తండ్రి సమాధానం రుచించలేదు రాములుకి. జాగ్రత్తగా కార్యకర్తలు చేస్తున్న నినాదాలు వినడానికి ప్రయత్నించేడు. కానీ ఒక్క ముక్కా అర్థం కాలేదు.

సింహాచలంది శ్రీకాకుళం. ఓ కాంట్రాక్టరుమాటలు నమ్మి, అయిదారేళ్ళ క్రితం భార్యతోసహా తెలంగాణా చేరేడు. ఇవ్వాల్సిన డబ్బు ఎగగొట్టి, ఆ కాంట్రాక్టర్ ఉడాయిస్తే, రోజుకూలీ చేసుకుంటూ గడువుకొస్తున్నాడు.

"బాబా! మనం ఆపాలి, ఎర్రజండాలట్టుకు జులుస్‌ల పోయినప్పుడు పప్పన్నం పెట్టేంద్రు కదా, అది బలే గున్న ఆపాలి, అమ్మ మల్లా ఒచ్చినాది జులుస్‌ల.. బాబా! బాబా!! అమ్మకి మల్లా కోడి బిర్యానీ అట్టుకుపోదావా?" తండ్రి తలమీద బాదుతూ హుషారుగా అడిగాడు రాములు.

"గట్లనే" అన్నాడు సింహాచలం.

"బాబా! మనం ఈ జులుస్‌ల పోకుండా, లారీమీద అంబేద్‌కర్ బొమ్మకాడికి పోతే, కోడి బిరియానీ ఎట్టరా?" ఎండని తట్టుకోలేక అడిగాడు తండ్రిని.

"ఎట్టరు" సమాధానం ఇచ్చాడు సింహాచలం.


సింహాచలంకి కొడుకు ఆకలి అర్థమవుతోంది.

రాత్రి తిన్న జొన్న సంకటి... ఉదయం వరగడువునే లారీ ఎక్కారు.

* * *

ఉదయం సూర్యుడు పొడవకముందే కాంట్రాక్టరు గుడిసె తలువు కొట్టి చేతిలో యాభై నోటు కుక్కి 'హైదరాబాద్ ఛలో' అన్నాడు లారీ చూపిస్తూ.

"యాభయ్యేనా, రోజుకూలీ యాభైమీద ఇరవై


మహాజనం వేళ్ళల్లోంచి పుట్టే
పుట్టి మనుషుల నాలుగు వేళ్ళు
వాళ్ళనే వెక్కిరించే
అరుదైన వ్యవస్థా చిత్రం..

కదా" అన్నాడు సింహాచలం.

"హైదరాబాద్‌ల కోడి బిరియానీ.. జులుస్ ఎవరిదో తెలుసా?.. జండాలట్టుకుని అరగంట వడక.. ఆ తర్వాత కోడి బిరియానీ.. సాయంత్రం సూర్యుడు గుంకముందే గూడెంలో దిగిపోతారు. ఏం తక్కువైంది?" కాంట్రాక్టర్ గదమాయించేడు.

కోడి బిరియానీ పేరు వినగానే, నిద్రలో వున్న రాములు లేచి కూర్చుని, తననీ తీసుకువెళ్ళమని మారాం చేశాడు.

"రాములమ్మ ఏదీ" సింహాచలంని తోసుకుంటూ గుడిసెలోకి జొరబడ్డాడు కాంట్రాక్టరు. "ఒసేయి రాములమ్మా! నీకు యాభై చేదా? కోడి బిరియానీ చేదా?" గదమాయించేడు కాంట్రాక్టర్.

సింహాచలం భార్య రాములమ్మ పచ్చి బాలింతరాలు. బిడ్డకి పాలు పట్టడం ఆపేసి, చిరుగుల చీరకొంగుని, భుజాల మీదనుంచి, ఒళ్ళంతా కప్పుకుంటూ, కాంట్రాక్టర్ ఆకలి చూపులు తప్పించుకునే ప్రయత్నంలో, లేచి నిలుచుంది.

"ఛలో.." అన్నాడు కాంట్రాక్టరు రాములమ్మ మీద యాభైనోటు విసురుతూ.

నిస్సహాయంగా భర్తవైపు చూసింది రాములమ్మ.

సింహాచలం కాంట్రాక్టర్‌ని బతిమలాడుకున్నారు. "అది పచ్చి బాలింతరాలు. కూలికే ఇంకా ఎల్లడం లేదు.. ఎండకి బిడ్డ సచ్చిపోతాది..." అన్నాడు.

కాంట్రాక్టర్ కనికరించాడు. కళ్ళతో, చీర చిరుగుల్లోంచి రాములమ్మ సొగసుల్ని మరోసారి జుర్రుకున్నాడు. వెకిలిగా నవ్వుతూ విసిరిన యాభైనోటుని వంగి తీసుకుని, వెనక్కి తిరిగి మరో గుడిసెలోకి జొరబడ్డాడు. భర్తని కూడా జులుస్‌కి వెళ్ళొద్దని బతిమాలింది రాములమ్మ. వడదెబ్బ తగిలితే, పది రోజులు కూలీకి వెళ్ళలేవంది. పస్తులు పడాలంది. జులుస్‌లో వెళ్ళేవాళ్ళందరికీ కోడి బిరియానీ పెడితే దేశంలో కోళ్ళే వుండవంది. కాంట్రాక్టర్ మాటలు నమ్మొద్దంది. కానీ సింహాచలం దృష్టంతా దిశమొలతో వెల్లకిలా పడుకుని వున్న రోజుల పసికందు మీద వుంది. పుట్టింది ఆడపిల్ల. దానికి ఓ రెండు అంగీలైనా కొనకపోతే చూసి వాళ్ళు ఏమనుకుంటారు.. హైదరాబాద్ కోఠీలో రంగురంగుల అంగీలు చాలా చవగ్గా ఇచ్చేస్తారని అందరూ చెప్తేరు. గూడెం నుంచి హైదరాబాద్‌కి బస్‌లో పోయి రావాలంటే యాభైపైగా ఖర్చవుతుంది. అదీకాకుండా ఓ రోజు కూలీ నష్టం.. కాంట్రాక్టర్ మాటలు వింటే, కూలీ కిడుతోంది, కూడూ కిడుతోంది. హైదరాబాద్ వెళ్లొచ్చే ఖర్చూ మిగులుతోంది.

కాంట్రాక్టర్ ఇచ్చిన యాభైని మొలలో దోపుకుని, కొడుకు రాముల్ని భుజాన వేసుకుని, లారీ ఎక్కాడు సింహాచలం.

రాములమ్మ నిస్సహాయంగా గుడిసె గుమ్మం దగ్గర నిలబడిపోయింది.

* * *

జులుస్ సాగుతోంది. ఎండ తీక్షణంగా పెరుగుతోంది. "బాబా! దాహం" అన్నాడు రాములు. నీడలో కూర్చుని, కూల్‌డ్రింక్స్ సిప్ చేస్తూ, సాగుతున్న ఊరేగింపుని చిరాగ్గా చూస్తున్న యువజంటల్ని చూస్తూ.

"చలివేంద్రం కాడ నీళ్ళు దొరుకుతాయి" అన్నాడు సింహాచలం అలాంటివాటికోసం కళ్ళతో చుట్టూ పరిశీలిస్తూ.

వంద గజాల దూరంలో వెదురు తడికలతో కట్టిన చలివేంద్రం కనిపించింది. అప్పటికే అందులోకి చాలామంది జనం జొరబడిపోయారు. పైనుంచి మండుతున్న ఎండ, నెత్తి మాడ్చేస్తూ వుంటే, ఓవైపు ఆకలి, మరోవైపు పిడచబారిపోతున్న నాలుకలు.. ఎవ్వరూ పోలీసు లాఠీలకు భయపడి, చలివేంద్రం దగ్గర, సభ్య ప్రపంచంక్యా కట్టుబాట్లు పాటించే పరిస్థితిలో లేరు. సింహాచలం కూడా కొడుకుని భుజంమీదనుంచి దించి ఆ దొమ్మీలోకి జొరబడ్డాడు. ఆ కుమ్ములాటలో, నీళ్ళు నిండబెట్టి వుంచిన కుండలు పగిలిపోయి, నీళ్ళంతా రోడ్డుపాలైనాయి. అంతా హతాశులయ్యారు. కొందరు తెలివైనవాళ్ళు రోడ్డు మీద పారుతున్న నీళ్ళలో తువ్వాళ్ళు తడిపి నెత్తి మీద కప్పుకుని సేదతీర్చుకున్నారు. మరికొందరు ఆ నీళ్ళల్లో నిలబడి మాడిపోతున్న పాదాల్ని క్షణంపాటు చల్లబర్చుకుని, జులుస్‌తోపాటు అడుగులు వెయ్యడం ప్రారంభించారు. హతాశుడైన సింహాచలం ఆ సందట్లో కొడుకుని వెదుక్కుంటూ వుంటే, రాములు రెండు చిట్టి చేతులతోను పగిలిన కుండపెంకుల్ని పట్టుకుని కనిపించాడు. "ఎందుకీ పెంకులు?" అన్నాడు సింహాచలం ప్రశ్నార్థకంగా. "బాబా! జులుస్‌ల ఎల్లేటప్పుడు, బస్సుల మీద రాళ్ళెయ్యాల గదా, అందుకే ఇవి ఏరుకొచ్చినా!" అన్నాడు తండ్రివంక మెరుస్తున్న కళ్ళతో చూస్తూ. "సీ.. అలాంటివేవీ కాంటాక్టర్ సెప్పలే.. పారేయ్!" అన్నాడు సింహాచలం పెంకుల్ని విసిరేస్తూ. రాములు చిన్నబుచ్చుకున్నాడు. ఇదివరకూ మరో పార్టీ జులుస్‌లో ఒచ్చినప్పుడు రాళ్లు విసిరి చాలా బస్సుల అద్దాలు పగలగొట్టారు. ఆ అనుభవం ఆ చిన్నారి మనసులో బాగా ముద్ర వేసుకుంది. మరి ఈ జులుస్‌లో అలాంటి కార్యక్రమాలు ఎందుకు లేవో రాములుకి అర్థం కాలేదు.

జులుస్ సాగుతోంది.. లిబర్టీ చౌరస్తా చేరేసరికి చాలా విపరీతమైన పోలీస్ బందోబస్తు వుంది. అన్ని రోడ్లలో ట్రాఫిక్ స్తంభించిపోయి వుంది. దూరంగా అంబేద్కర్ విగ్రహం కనిపించేసరికి కార్యకర్తల్లో ఉద్రేకం పెరిగింది. జులుస్ జోరు పెరిగింది. రాములులోనూ ఉద్రేకం పెరిగింది. "బాబా! బాబా! ఆడ కోడి బిరియానీ ఆకుల్లో ఒడ్డిస్తారా, పొట్లాలిస్తారా?" తండ్రి తలమీద బాదుతూ, ఉద్రేకం ఆపుకోలేక అడిగాడు.

"పొట్లాలిస్తారు గావాల" సింహాచలంకి కూడా నోరూరింది. ఎప్పుడో కొన్నేళ్ళ క్రితం రాములమ్మ ఎవరిదో ముస్లింల పెళ్ళి బారాతులో గేస్ లైట్ మొయ్యడానికి కూలికి కుదిరినప్పుడు... ఇంత బిరియానీ కొంగులో కట్టుకుని తనకోసం తెచ్చింది. 'ఈరోజు వీలైతే ఓ బిరియానీ పొట్లం రాములమ్మకి కూడా తీసుకుపోవాల' అని మనసులో అనుకున్నాడు సింహాచలం.

జులుస్ అంబేద్కర్ చౌరస్తా చేరింది. కార్యకర్తలు జులుస్‌ని సచివాలయం దాకా సాగించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ పోలీసులు రోడ్డుకి అడ్డంగా ముళ్ళతీగలు కట్టి, దారి మూసేశారు. కార్యకర్తలు ఆ ముళ్ళతీగల్ని తెంచుకుని పోలీసులతో కలబడే జోరులో వున్నారు. వివాదాలు తారస్థాయికి చేరుకున్నాయి. పోలీసులు లాఠీలు అడ్డంపెట్టి జనాన్ని వెనక్కి నెడుతున్నారు. మైకులలో హెచ్చరికలు చేస్తున్నారు. అంబేద్కర్ చౌరస్తా మొత్తం జులుస్‌లో ఒచ్చిన జనంతో కిటకిటలాడుతోంది. పరిస్థితి అదుపు తప్పే పరిస్థితిలో వుంది. ఆ కుమ్ములాటలో వల్లె జనానికి ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. అలా వుండగా.. లోయర్



**స్వేదం**

ఆమిర్‌ఖాన్‌కు దర్శకుడి పనిలో అతిగా జోక్యం చేసుకునే అలవాటు. ఈమధ్య ఒక సినిమాలో కార్ మెకానిక్‌గా నటిస్తున్న ఆమిర్‌పై కారు గ్యారేజ్‌లో పని జరుగుతున్న దృశ్యం తాలూకు షూటింగ్ జరుపుతున్నారు. ఇంతలో ఆమిర్ కట్ అన్నారు. ఏమిటయ్యా అంటే ఆ సీన్లో ఆయన వంటిమీద చెమట శారీరక శ్రమ వల్ల కారుతున్నట్టు లేదట. ముష్టియుద్ధం చేస్తే పట్టిన చెమటలా వుందట. ఇది విన్న యూనిట్ వారందరికీ చెమట పట్టేసిందనుకోండి.

టాంక్‌బండ్‌లో బిరియానీ పంచుతున్నారన్న వార్త జనంలోకి పాకింది. చెరువుకు గండిపడ్డట్టు జనం అంతా లోయర్ టాంక్‌బండ్‌వైపు పరుగులు తీశారు. దూరంగా ఓ చిన్న లారీనిండా పసుపు పచ్చటి అన్నం కనిపించింది. జనం ఆ లారీపైకి ఎగబడ్డారు. లారీపైనున్న కార్యకర్తలు దోసిళ్ళతో, లారీ చుట్టూ చేరిన జనానికి అన్నం పంచడం ప్రారంభించారు. క్యూ పాటించమని కార్యకర్తలు అరుస్తున్నారు. నోటికొచ్చిన తిట్లు తిడుతున్నారు కానీ జనం ఎవరినీ లెక్కచేసే స్థితిలో లేరు. సింహాచలం రాముల్ని భుజం మీదనుంచి దించి, ఆ దొమ్మీలోకి జొరబడ్డాడు. ఉన్న బలాన్నంతా కూడగట్టుకుని జనాన్ని తోసుకుంటూ, లారీ దగ్గ రకి చేరుకున్నాడు. లారీమీదనుంచి ఓ కార్యకర్త సింహాచలం దోసిలి నిండా ఇంత అన్నం పోశాడు. ఆ అన్నాన్ని బంగారంలా అరచేతుల మధ్య బిగించి, ఆ కుమ్ములాటలోంచి బయటపడేసరికి ఓ పిడికెడు మెతుకులు మాత్రమే మిగిలాయి. ఆకలి, ఆశ నిండిన కళ్లతో ఎదురుచూస్తూ నిలబడివున్న కొడు కుని చూస్తే సింహాచలం కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. గబగబా దోసిట్లో మిగిలిన అన్నాన్ని రెండు ముద్ద లుగా చేసి, రాములుకి తినిపించాడు. గొంతు మొత్తం ఎండిపోయి వుండడంతో రాములుకి పొలమారింది. నోట్లో పెట్టిన అన్నం మొత్తం కక్కుకున్నాడు. సింహాచలం గుండె చెరువైంది. ఏం చెయ్యాలో పాలుపోలేదు. పిల్లాడు ఆకలికి తోటకూర కాడలా వేలాడిపోతున్నాడు.

"సరే పదా, కాంట్రాక్టరు ఇచ్చిన పైసలతో అన్నం కొనుక్కు తిందాం" అంటూ లేచి నిలుచున్నాడు సింహాచలం ఉదయం మొలలో దోపుకున్న యాభై నోటు కోసం మొలలో తడుముకుంటూ. కానీ ఆ యాభై చేతికి ఎక్కడా తగలలేదు. సింహాచలంకి మతిపోయింది. పిచ్చాడిలా అన్నం లారీ దగ్గరికి పరిగెత్తి, ఆ దొమ్మీలో జనం కాళ్ళకింద వలు గుతూ, జారిపోయిన యాభైనోటు కోసం వెదకడం ప్రారంభించాడు.

* * *

సూర్యాస్తమయం కాబోతోంది. లారీలు తిరుగు ప్రయాణం ప్రారంభించాయి. ఓ లారీమీద సింహా చలం ఒడిలో సొమ్మసిల్లిన కొడుకుతో జీవచ్ఛవంలా కూర్చుని వున్నాడు. అతని కళ్ళ ఎదురుగా గుడి సెలో దీశమొలతో వెల్లకిలా పడుకుని వున్న రోజుల పసికందు కనిపిస్తోంది.. గుడిసె దగ్గర చాలీచాలని చిరుగుల చీర చుట్టుకుని నిస్సహాయంగా నిలబడి వున్న రాములమ్మ కనిపిస్తోంది.

"బాబా! కోడి బిరియానీ ఎప్పుడెడతారు?" మగతలో రాములు పలవరిస్తున్నాడు.

"ఇంటికి పోయి జొన్న సంకటి తిందాం" అన్నాడు జీవం లేని స్వరంతో సింహాచలం.

—●—

# బతుకు పుస్తకంలో అరుదైన పుట తెరచుకున్న అల చప్పుడు

మాది ఒరిస్సా రాష్ట్రంలోని బరంపురం..

తెలుగు సాహితీ చరిత్రలో ఓ ప్రత్యేక స్థానం వున్న అక్షరవేదిక బరంపురం.

మహామహా సాహితీమూర్తులు, సంస్కరణవాదులు, ఆలనాడు ఉద్య మాలకు శ్రీకారం చుట్టిన బరంపురం.

ఆ మట్టిలో నేనూ పుట్టినందుకు, మనసులో, ఏమూలనో పిసరంత గర్వం..

సిటీ హైస్కూల్ రోజుల్లోనే, ఉపాధ్యాయుల ఆదరపూర్వక ప్రోత్సా హంతో, ఊహల్ని ప్రోది చేసుకున్న యవ్వన బాల్యం.. చిట్టి చిట్టి కవితలు, చిన్ని చిన్ని నాటికలు. ప్రదర్శనలు, అద్దంలో చూసుకున్న ముఖపు రంగుల్లో, బహుముఖాలుగా ఊహించుకున్న 'బతుకు పుస్తకం', తెలిసీ తెలియని వయసులో నాటిన సాహితీ బీజాలు, గుండెల్లో పరవళ్ళు తొక్కే అంతులేని ఉత్సాహం.. పరుగులు..

ఖల్లికోట కాలేజీ రోజుల్లో, తెలుగు సాహితీ సమితి, కవితల్లో కాలక్షేపం, రచనల్లో పరిష్వంగం, చర్చల్లో ఉడుకు రక్తం.. జలపాతంలా పుట్టిన విప్లవ సాహిత్యం వేపు చూపు..

వికాసాంధ్ర సాహితీ సంస్కృతి సంవేదికలో (వికాసం) కీ.శే. డాక్టర్ ఉప్పల లక్ష్మణరావుగారు కలానికి పెట్టిన పదును, సిరాతల్లో సామాజిక 'స్పృహ', కలం కలల్లో చైతన్య దీప్తి. మహామహా సాహితీమూర్తు లతో భేటీలు, కరచాలనాలు, అడపాదడపా పత్రికల పుటల్లో పేరు చూసుకున్నప్పటి సంచలనాలు..

శ్రీ మహీధర రామమోహనరావుగారితో అరుదైన పరిచయం. ప్రోత్సాహం, వారి 'అభ్యుదయ' పత్రిక స్ఫూర్తి, ప్రవాసాంధ్ర రచయిత (త్రు)ల కోసం 'స్పృహ' పత్రిక ప్రచురణ, రెండేళ్లపాటు సాహిత్యం కోసం జేబుల ఖాళీ చేసుకోవడం,

సత్యాన్వేషణ, సాహితీసంఘ పరిత్యాగం, కార్మిక ఉద్యమాల్లో భాగస్వామ్యం, ఉపన్యాసాలు, ధర్నాలు, సమ్మెలు, జిందాబాద్‌లు.. జీవితం 'అర్థసత్యం' అనే విషయం చూఛాయగా తెలియడం..

శ్రీమతి 'సుజని' జీవిత భాగస్వామ్యం.. రంగవల్లిక లాంటి చిరు జీవితంలోకి చిన్నారి వీణ..

ఇండియన్ బ్యాంక్.. ఉద్యోగ పర్వంలో బరంపురం నుంచి బదిలీ.. భాగ్యనగరంలో మూడేళ్ళుగా నిశ్శబ్ద, నిస్తబ్ద అనామకత్వంలో.. ఇదిగో.. ఈ బహుమతి.. రవీంద్ర భారతిలో, 1997 ఆగస్టు 16 సాయంత్రం సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా.. బతుకు పుస్తకంలో అరుదైనపుట తెరచుకున్న అల చప్పుడు.. మరుగున పడిన కలానికి బూజు దులిపి, ప్రోత్సాహాన్నిచ్చిన ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, తెలుగు కళాసమితి (న్యూజెర్సీ), రాజాలక్ష్మీ ఫౌండేషన్ (మద్రాసు) వారికి,

ముఖ్యంగా ఆంధ్రజ్యోతి వారపత్రిక 'కథ' నాయకులు, సాహితీ మిత్రులు దాట్లగారికి, కృతజ్ఞతలు చెప్పుకోడానికి సరైన పదాలు దొరక్క, వెతుక్కుంటూ, వెతుక్కుంటూ...

మీ

మడపల్లి రమేష్‌రాజు

హైదరాబాద్